ఉద్యమంలో కేసీఆర్, జయశంకర్ సూర్యచంద్రులు

- ఉద్యమాలకు ఉగ్గుపాలు పోసిన గడ్డ సిరిసిల్ల
- శిరస్సు వంచి నమస్కరిస్తున్నా • కేసీఆర్ ఆమరణ దీక్ష చరిత్రాత్మకం
- ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ • సిరిసిల్లలో దీక్షా దివస్‌కు హాజరు

దీక్ష దివస్‌లో ఏర్పాటు చేసిన అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, నాయకులు

రాజన్న సిరిసిల్ల,(నమస్తే తెలంగాణ) సిరిసిల్ల టౌన్, నవంబర్ 29: స్వరాష్ట్ర ఉద్యమంలో కేసీఆర్, ప్రొఫెసర్ జయంకర్ సూర్యచంద్రులని ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ స్పష్టం చేశారు. ఉద్యమాలకు ఉగ్గు పాలు పోసిన గడ్డ సిరిసిల్ల అని కొనియాడారు. ఏ ఉద్యమమైనా ఇక్కడి నుంచే పుట్టిందని, మలిదశ తెలంగాణ ఉద్యమానికి పెట్టని కోటగా నిలబడిందని గుర్తు చేశారు. అలాంటి గడ్డకు తాను శిరస్సు వంచి నమస్కరిస్తున్నానన్నారు. శుక్రవారం దీక్షా దివస్ సందర్భంగా జిల్లా కేంద్రంలోని తెలంగాణ భవన్ ఎదుట నిర్వహించిన దీక్షా శిబిరానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మొదట కొత్తబస్టాండ్‌లోని తెలంగాణ తల్లి, అంబేద్కర్, గాంధీ, చాకలి ఐలమ్మ, కొండా లక్ష్మణ్‌బాపూజీ, నేతన్నల విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. పాతబస్టాండ్‌లోని అమర వీరుల స్తూపం వద్ద నివాళులర్పించారు. అనంతరం బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు, నాయకులతో కలిసి తెలంగాణ భవన్‌కు చేరుకుని దీక్షలో పాల్గొని ప్రసంగించారు. తెలంగాణకు పూర్వం ఇక్కడ ఘోరకలి ఉండేదని, నేతన్నల ఆత్మహత్యలు తెలంగాణ ఉద్యమానికి ఊపిరిపోశాయని చెప్పారు. ఒక్కసారి ఒడిపిన రక్తం కాదని, 1952లో తెలంగాణ ఉద్యమం మొదలైందని, నెత్తురు సాకవోస్తేనే స్వరాష్ట్రం వచ్చిందని స్పష్టం చేశారు. స్థానికేతరుల్లారా వెళ్లిపోండని, మా ఉద్యోగాలు మీరెట్ల చేస్తరని అడిగినందుకు తుపాకులతో కాల్చిన దుర్మార్గులు సమైక్య వాదులని మండి పడ్డారు. తెలంగాణ అంటే నక్సలైట్‌గా ముద్రవేశారని గుర్తు చేశారు. నాడు చనిపోయిన నలుగురు బిడ్డల నెత్తుటితో తడిసిన అంగీలను జెండాలుగా ఎత్తుకుని హైదరాబాద్‌లో ఊరేగింపు నిర్వహించినట్లు తెలిపారు. ఆనాటి ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావు కారును కాలబెట్టినట్లు గుర్తు చేశారు. 369 మంది బిడ్డలు 1969లో ప్రాణాలు కోల్పోయారని గుర్తు చేశారు. తెలంగాణపై విశ్వాసం కోల్పోయిన ప్రజలు దిక్కుతోచని స్థితిలో సాగుతున్న ప్రయాణాన్ని దీక్షతో మలుపు తిప్పి గెలుపు బాటలో పయనించేలా చేసిన మహానుభావుడు కేసీఆర్ అని కొనియాడారు. ఆయన చేపట్టిన ఆమరణ నిరాహార దీక్ష చరిత్రాత్మకమన్నారు. తెలంగాణ అగ్ని పర్వతం బద్ధలైన రోజు నవంబర్ 29 అని స్పష్టం చేశారు. ఆ రోజు లేకుండా డిసెంబర్ 9 లేదని, డిసెంబర్ 9 లేకుండా జూన్ 2 లేదన్నారు. డిసెంబర్ 9 దీక్షా విజయం సాధించిన 'విజయ్ దివస్'గా జరుపుకోవాలని పిలుపు నిచ్చారు. జూన్ 2 తెలంగాణ పుట్టుకకు మంత్రసాని అయ్యిందని పేర్కొన్నారు. రేవంత్‌రెడ్డి ఒప్పుకొన్నా, ఒప్పుకోక పోయినా ఇది చారిత్రక సత్యమన్నారు. కేసీఆర్ ఆనవాళ్లు మలిపేస్తానంటున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో అది అయ్యే పనికాదన్నారు. నవంబర్ 29 దీక్షనా? డిసెంబర్ 9నా? తెలంగాణ వచ్చిన జూన్ 2ను మలిపేస్తావా? అంటూ నిలదీశారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య అధ్యక్షతన జరిగిన దీక్షలో పార్టీ పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి, సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, వైస్ చైర్మన్ దేవరకొండ తిరుపతి, మున్సిపల్ చైర్‌పర్సన్లు జిందం కళ, రామతీర్థపు మాధవి, గ్రంథాలయ మాజీ చైర్మన్ ఆకునూరి శంకరయ్య, బీఆర్ఎస్ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ఆకాంక్ష నెరవేర్చిండు

తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన దిక్సూచి కేసీఆర్. రాష్ట్ర సాధన కోసం కేసీఆర్ దీక్ష పూనిన రోజును దీక్షా దివస్‌గా జరుపుకొంటున్నం. డాక్టర్ అంబేద్కర్ రూపొందించిన రాజ్యాంగం ద్వారా తెలంగాణ రాష్ట్రం సిద్ధించింది. తొలి దశ ఉద్యమంలో అనేక మంది ప్రాణత్యాగం చేసిన్రు. మరుగున పడిన ఉద్యమాన్ని అహింసా పద్ధతిలో గాంధేయ మార్గంలో కేసీఆర్ దీక్షను చేపట్టిండు. మహాత్ముడి స్ఫూర్తితో రాష్ట్ర సాధనకు అడుగులు వేసిండు. ఉద్యమం ద్వారా కేసీఆర్ నాలుగున్నర కోట్ల ప్రజల ఆకాంక్షను నెరవేర్చిండు. సాధించిన రాష్ట్రాన్ని పదేండ్ల పాలనలో దేశంలోనే మార్గదర్శకంగా నిలిపి మహానేతగా నిలిచిండు.

- తోట ఆగయ్య, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు

ఉద్యమ స్ఫూర్తితో పనిచేద్దాం

కేసీఆర్ చావు నోట్లో త లపెట్టి దీక్ష ప్రారంభించి న రోజును దీక్షాదివస్‌గా జరుపుకొంటున్నం. ఉద్యమ కాలంలో మనమంతా ఎంత ఐక్యంగా పని చేశామో అదే స్ఫూర్తితో నేడు ప్రజా సమస్యలపై కాంగ్రెస్ పార్టీ అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడాల్సిన అవసరం ఉన్నది. అందుకోసం ప్రతి కార్యకర్త పోరుబాట పట్టాలి. నాడు కేసీఆర్, కేటీఆర్ నాయకత్వంలో గాంధేయ మార్గంలో రాష్ట్రాన్ని సాధించుకున్నం. అదే తరహాలో మరోసారి బీఆర్ఎస్ పార్టీని అధికారంలోకి తెచ్చేందుకు పని చేయాల్సిన అవసరం ఉన్నది.

- జిందం చక్రపాణి, బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు

అల్లునూర్ చౌరస్తాలో మాజీ సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, నాయకులు

అల్లునూర్ సభలో మాట్లాడుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే కేటీఆర్, వేదికపై శాసనమండలి ఉపాధ్యక్షుడు బండ ప్రకాశ్, ఎమ్మెల్యే గంగుల, మాజీ ఎమ్మెల్యేలు రసమయి బాలకిషన్, సుంకె రవిశంకర్, మేయర్‌సునీల్‌రావు, మాజీ మేయర్ రవీందర్‌సింగ్, జీవీఆర్, విజయ

కరీంనగర్ గడ్డకు వందనం

- ఈ నేల లేకుంటే తెలంగాణ వచ్చేది కాదు • బీఆర్ఎస్‌కు జన్మనిచ్చిన పురిటిగడ్డ ఇది • ఉద్యమాన్ని మలుపుతిప్పింది అల్లునూర్ • కేసీఆర్ రణ నినాదం చేసింది ఇక్కడే • కాంగ్రెస్ హామీలు అమలయ్యే దాకా ప్రజల పక్షాన కలిసికట్టుగా పోరాడుదాం
- ఉద్యమ చరిత్రలో కేసీఆర్ హిమాలయ శిఖరం • రేవంత్ రెడ్డి ఆయన కాలి గోటికి సరిపోడు • అల్లునూర్ దీక్షా దివస్ సభలో కేటీ రామారావు • ఎల్ఎండీ వద్ద అమరుల స్తూపానికి కేటీఆర్ నివాళులు • అల్లునూర్ చౌరస్తాలో కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం

> కరీంనగర్ అంటే రాష్ట్రమంతా తెలుసు. తెలంగాణ రాష్ట్ర సమితికి జన్మనిచ్చిన గడ్డ ఇది. 2009లో ఓటమితో టీఆర్ఎస్ చెల్లా చెదురైపోయిందని, ఇక తెలంగాణ వాదం ఉండదని, రాష్ట్రం గురించి మరిచిపోవాల్సిందే అన్న సందర్భంలో ఇదే కరీంనగర్‌లో కేసీఆర్ రణనినాదం చేసిండు. నా శవయాత్రనో, తెలంగాణ జైత్ర యాత్రనో.. అని ఆయన ఆమరణ దీక్షకు బయలు దేరినప్పుడు అల్లునూర్‌లో మరోసారి బ్రహ్మాండమైన ఉద్యమానికి ఊపిరి పోసింది కరీంనగరే. ఈ గడ్డకు, ఇక్కడి బిడ్డలకు నా వందనం. అల్లునూర్‌లో మరోసారి దీక్ష దివస్ నిర్వహించి నన్ను ఆహ్వానించడం గర్వంగా ఉన్నది.
>
> **- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్**

కేసీఆర్ దీక్ష చరిత్ర

నేను 2009లో ఎమ్మెల్యేగా ఉన్నప్పుడే కేసీఆర్‌ను అల్లునూర్‌లో అరెస్ట్ చేశారు. ఈ ఘటనతో ఎంతో భావోద్వేగానికి గురయ్యా. కేసీఆర్ హైదరాబాద్ నుంచి కరీంనగర్ వస్తున్నప్పుడు కార్యకర్తలు సైనికుల్లా కాపలా ఉండేవారు. వారిని దాటి కేసీఆర్ వద్దకు వెళ్లాలంటే పోలీసులకు సాధ్యమయ్యేది కాదు. అలాంటిది కేసీఆర్‌ను మోసం చేసి, 2009 నవంబర్ 29న అల్లునూర్ చౌరస్తాలో అరెస్టు చేశారు. అందుకోసమే రాయలసీమ, ఆంధ్రా నుంచి వేలాది మంది పోలీసులను తెప్పించారు. ఆమరణ దీక్ష కోసం కదిలిన కేసీఆర్‌ను అరెస్టు చేసి ఖమ్మం జైలుకు తరలించారు. అక్కడ కూడా కేసీఆర్ దీక్ష చేయడంతో నిమ్స్‌లో చేర్చారు. ఆనాడు కేసీఆర్ దీక్ష చేయకుంటే తెలంగాణ వచ్చేది కాదు. ఇది చరిత్రలో శాశ్వతంగా నిలిచి పోతుంది. కేసీఆర్ చరిత్ర అనేది నల్లబోర్డుపై చాక్‌పీస్‌తో రాసింది కాదు. తెలంగాణ ప్రజల గుండెల్లో, చరిత్ర పుటల్లో సువర్ణాక్షరాలతో లిఖించబడింది. కేసీఆర్ పేరును చెరిపేస్తామంటున్న కొందరు ఈ విషయాన్ని గ్రహించాలి. చరిత్రలో అల్లునూర్ పేరును చెరిపేసే దమ్ము వారికి లేదు.

- గంగుల కమలాకర్, మాజీ మంత్రి

కేసీఆర్‌కు కరీంనగర్ ఒక ఎమోషన్

బీఆర్ఎస్ అధినేత ఏ పని చేసినా కరీంనగర్ నుంచే ప్రారంభిస్తారు. కరీంనగర్ అంటే ఆయనకు ఒక ఎమోషన్. తెలంగాణ ఉద్యమాన్ని మలుపు తిప్పిన అల్లునూర్ చౌరస్తా చారిత్రాత్మక ప్రాంతం. నేడు ఏ గ్రామానికి వెళ్లినా మళ్లీ కేసీఆర్ కావాలంటున్నారు. గొప్ప పథకాలతో ప్రజల గుండెల్లో చిరకాలంగా ఆయన చెరగని ముద్ర వేసుకున్నారు. కేసీఆర్ అంటే పంటలు, నీళ్లు, అభివృద్ధి. రైతు బంధు గురించి ఐక్య రాజ్య సమితిలో చర్చ జరగడమే ఆయన ఆలోచనలకు నిదర్శనం. ఆయన ఏం చేసినా కరీంనగర్‌కే ప్రాధాన్యమిస్తారు. ప్రస్తుతం తెలంగాణ ఆకాంక్షలకు భిన్నంగా పాలన సాగుతున్నది. దీనిపై మళ్లీ పిడికిలి బిగించాల్సిన అవసరమున్నది.

- బండ ప్రకాశ్, శాసన మండలి ఉపాధ్యక్షుడు

అల్లునూర్ చౌరస్తా నుంచి సభకు ర్యాలీగా వస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు

అల్లునూర్ చౌరస్తా నుంచి సభకు ర్యాలీగా వెళ్తున్న మాజీ మంత్రి కేటీఆర్, ఎమ్మెల్యే గంగుల, మాజీ ఎమ్మెల్యేలు

కరీంనగర్, నవంబర్ 29 (నమస్తే తెలంగాణ): తెలంగాణ రాష్ట్ర సమితి అనే పార్టీకి జన్మనిచ్చిన పురిటి గడ్డ కరీంనగర్ అని, కరీంనగర్ లేకుంటే తెలంగాణ సిద్ధించేది కాదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు స్పష్టం చేశారు. కేసీఆర్ అంటే తెలంగాణ చరిత్రలో హిమాలయ శిఖరమని కొనియాడారు. ప్రగల్భాలు పలికే సీఎం రేవంత్ రెడ్డి ఆయన కాలి గోటికి కూడా సరిపోడని స్పష్టం చేశారు. 2009 నవంబర్29న కేసీఆర్ ఆమరణ దీక్షకు వెళ్తూ అరెస్టయిన అల్లునూర్‌లో శుక్రవారం బీ ఆర్ఎస్ ఆధ్వర్యంలో దీక్షా దివస్ సభ నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా కేటీఆర్ హాజరయ్యారు. ముందుగా తిమ్మాపూర్ మండలం ఎల్ఎండీ కాలనీలోని అమరుల స్తూపం వద్ద నివాళులర్పించి, అక్కడి నుంచి భారీ బైక్ ర్యాలీగా అల్లునూర్ వచ్చారు. కేసీఆర్ అరెస్టయిన చౌరస్తాలో ఆయన చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఆ తర్వాత శ్రేణులతో కలిసి వరంగల్ రోడ్డులో నిర్వహించిన సభాస్థలికి చేరుకున్నారు. సభలో కేటీఆర్ పాల్గొని, శ్రేణుల్లో ఉత్తేజం నింపారు. ఉద్యమంలో కరీంనగర్ జిల్లా పాత్రను వివరించారు. పదే పదే కరీంనగర్ పేరును ప్రస్తావించి జోష్ నింపారు. 2001 మే 17న కరీంనగర్‌లో జరిగిన సింహగర్జనతోనే సింహం లాంటి నాయకుడు కేసీఆర్ గురించి దేశం మొత్తానికి తెలిసిందంటే దానికి కారణం కరీంనగర్ గడ్డనేనని స్పష్టం చేశారు. 2006 లో తెలంగాణ వాదం ఎక్కడున్నదని ఈసడించుకున్న కాంగ్రెస్ నాయకులకు సమాధానంగా కేసీఆర్‌ను కరీంనగర్ ఎంపీగా 2 లక్షల పైచిలుకు ఓట్ల మెజార్టీతో గెలిపించి ఉద్యమానికి పునర్జన్మనిచ్చిన గడ్డ కూడా ఈ కరీంనగరేనని ఉద్ఘాటించారు. కేసీఆర్ అంటే ఒక పేరు కాదని, అది తెలంగాణ పోరని ఆనాడు ప్రజలు గుర్తించారని, ఆయన పలికిన ప్రతి మాట ఒక తూటాలాగా పేలిందని, తెలంగాణ ప్రజలను ఒక రాజకీయ శక్తిగా మలిచి ఉద్యమాన్ని నడిపించారని గుర్తు చేశారు. కేసీఆర్ నాయకత్వం, విద్యార్థుల బలిదానం తెలంగాణ రావడానికి ప్రధాన కారణమని, ఆనాడు విధిలేని పరిస్థితుల్లో కాంగ్రెస్ పార్టీ రాష్ట్రం ఇచ్చిందని వివరించారు. ఉద్యమంతో సంబంధం లేనోడు, తుపాకీ పట్టుకొని మనల్ని బెదిరించేందుకు వచ్చినోడు ఇప్పుడు తెలంగాణలో కేసీఆర్ ఆనవాళ్లు లేకుండా చేస్తానని ప్ర గల్భాలు పలుకుతున్నాడని మండిపడ్డారు. ఇపుడు రాష్ట్రంలో ఎవరినీ కదిలించినా కన్నీళ్లు పెట్టుకుంటున్నారని, ఏడాది కూడా నిండని కాంగ్రెస్ పాలనలో మహిళలు, ఆటో డ్రైవర్లు, రైతులు ఇలా అన్ని వర్గాల వారు ఇబ్బందులపాలవుతున్నారని అన్నారు. మోసపూరిత హామీలు ఇచ్చి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని, ఇచ్చిన హామీలను ఈ నాలుగేళ్లలో అమలు చేసే దాకా ప్రజల పక్షాన నిలిచి పోరాడుదామని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు అధ్యక్షతన జరిగిన ఈ సభలో మేయర్ వై సునీల్‌రావు, డిప్యూటీ మేయర్ చల్ల స్వరూపా హరిశంకర్, సివిల్ సప్లయ్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ సర్దార్ రవీందర్ సింగ్, జడ్పీ మాజీ అధ్యక్షురాలు కనుమల్ల విజయ, మున్సిపల్ చైర్‌పర్సన్లు గందె మాధవి, రుద్ర రాజు, నాయకులు ఏనుగు రవీందర్ రెడ్డి, పొన్నం అనిల్ గౌడ్, ఉల్లెంగుల ఏకానందం, రావుల రమేశ్, కేతిరెడ్డి దేవేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ రుణం తీర్చుకోలేం

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చరిత్ర గురించి ఏడాదిపాటు మాట్లాడినా ఒడవని ముచ్చట. ఆనాడు 'వస్తే తెలంగాణతోనే వస్తా.. లేకపోతే చస్తా' అని మరణ వాగ్మూలం రాసుకుని బయలుదేరిన గొప్ప నేత కేసీఆర్. చావు నోట్లో తలకాయ పెట్టి తెలంగాణను తెచ్చిండు. దేశంలోనే ఆదర్శంగా నిలిపిండు. అలాంటి వీరుడికి ఏమిచ్చినా తక్కువే. ఆయన రుణం తీర్చుకోలేం. తెలంగాణ ఉద్యమంలో అల్లునూర్ చరిత్ర గొప్పది. ఇక్కడికి రాగానే కేటీఆర్ కళ్లు కన్నీళ్లతో నిండిపోయాయి. ఆయన కంట్లో కన్నీళ్లు కావు.. గోదావరి జలాలు.

- రసమయి బాలకిషన్, మానకొండూర్ మాజీ ఎమ్మెల్యే

కేసీఆర్ అంటే ఒక చరిత్ర

ఒకప్పుడు తెలంగాణ అంటే ఆత్మహత్యలు, వలస బతుకులు, అన్యాయాలు మాత్రమే కనిపించేవి. వాటిని ఆపేందుకు కేసీఆర్ గులాబీ జెండా ఆవిష్కరించారు. కేసీఆర్ అంటే ఒక చరిత్ర. నాటి ఆమరణ దీక్ష రోజులు కండ్లకు కనిపిస్తున్నయి. ఎప్పుడు ఏం జరుగుతుందోనని యావత్తు దేశం ఉత్కంఠగా ఎదురు చూసింది. తెలంగాణ ప్రజలు మళ్లీ కేసీఆర్ ముఖ్యమంత్రి కావాలంటున్నారు. ప్రజల మద్దతు ఇలాగే ఉండాలి.

- సుంకె రవిశంకర్, చొప్పదండి మాజీ ఎమ్మెల్యే

వేచి చూశాం.. ఇక ఎండగడుదాం

- ప్రజల విశ్వాసం కోల్పోయిన కాంగ్రెస్ సర్కారు • తిట్టడం తప్ప వెలగబెట్టిందేమీ లేదు • ఉద్యమ చరిత్రలో కేసీఆర్ హీరో.. రేవంత్ జీరో • దీక్షా దివస్‌లో మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్

కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, పక్కన బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్, మాజీ ఎమ్మెల్యేలు దాసరి మనోహర్‌రెడ్డి, పుట్ట మధూకర్, బీఆర్ఎస్ నాయకురాలు దాసరి ఉష

పెద్దపల్లి, నవంబర్ 29(నమస్తే తెలంగాణ)/పెద్దపల్లి: 'ప్రజలకు అలవి కాని హామీలు ఇచ్చారు. వాటిని అమలు చేయడం వారి తరం కావడం లేదు. 11 నెలల పాటు వేచి చూశాం. రోజూ అటు కేసీఆర్‌నో.. ఇటు కేటీఆర్‌నో తిట్టడం తప్ప వాళ్లు పాలనలో వెలగబెట్టింది ఏమీ లేదు. ఇక ఊరుకునేది లేదు. ఎక్కడికక్కడ ఎండగడుదాం' అని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ పిలుపునిచ్చారు. శుక్రవారం పెద్దపల్లిలోని బీఆర్ఎస్ కార్యాలయమైన తెలంగాణ భవన్‌లో మాజీ ఎమ్మెల్యేలు కోరుకంటి చందర్, పుట్ట మధూకర్, దాసరి మనోహర్‌రెడ్డి ఆధ్వర్యంలో చేపట్టిన దీక్షా దివస్‌కు ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. మలిదశ తెలంగాణ ఉద్యమంలో యావత్ ప్రజలను ఒక్కటి చేసి, రాష్ట్ర సాధన చరిత్రలో కేసీఆర్ ఒక హీరో అయితే.. ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆనాడు జీరో అని ఎద్దేవా చేశారు. ఉద్యమ కారులపై తుపాకీ గురిపెట్టి ఆంధ్రా పాలకుల అడుగులకు మడుగులొత్తి ఉద్యమాన్ని నీరుగార్చే కుట్రలు చేసింది రేవంత్‌రెడ్డి అని మండిపడ్డారు. ఉద్యమ నేత కేసీఆర్ పుణ్యమా అని సాధించిన రాష్ట్రానికి నేడు రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన విషయాన్ని మర్చిపోవద్దని హితవు పలికారు. 2009 నవంబర్ 29 ఉద్యమ చరిత్రను మలుపుతిప్పిన రోజన్నారు. కేంద్రం దిగివచ్చి ప్రత్యేక రాష్ట్రాన్ని ప్రకటించేలా చేసిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. తెలంగాణలో బీఆర్ఎస్ లేకుండా చేస్తానని సీఎం రేవంత్‌రెడ్డి పగటి కలలు కంటున్నాడని, అది ఆయన కాదు కాదా ఆయన తాత తరం కూడా కాదన్నారు. బీఆర్ఎస్ అనేది త్యాగాల పునాదులపై ఏర్పడ్డ పార్టీ అని స్పష్టం చేశారు. అప్పటి దీక్షా దివస్ తెలంగాణ రావడానికి కారణమైతే, నేటి దీక్షా దివస్‌ను కాంగ్రెస్‌ను గద్దె దింపడానికి లక్ష్యంగా తీసుకోవాలని సూచించారు. కేసీఆర్‌ను మళ్లీ ముఖ్యమంత్రిని చేయడానికి బీఆర్ఎస్ సైనికులు మొక్కవోని ధైర్యంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ప్రతి ఇంటిలో ఉన్న కేసీఆర్ పేరును చెరిపివేయడం రేవంత్‌రెడ్డి తరం కాదన్నారు. రాష్ట్రం కోసం ప్రాణత్యాగానికి సిద్ధపడ్డ కేసీఆర్‌కు, రేవంత్‌రెడ్డికి మధ్య నక్కకు నాగలోకానికి ఉన్నంత తేడా ఉందని ఉద్ఘాటించారు. బీఆర్ఎస్‌లో నాయకులు లేరని, అందరూ ఉద్యమ కారులేనని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మూల విజయారెడ్డి, రఘువీర్ సింగ్, గంట రాములు, మురళీధర్ రావు, గోపు ఐలయ్య యాదవ్, తగరం శంకర్‌లాల్, ఎక్కేటి అనంతరెడ్డి, ఏగోళపు శంకర్‌గౌడ్, మోహన్‌రెడ్డి, నారాయణ, ఉప్పు రాజ్‌కుమార్, ముబీన్, పూదరి చంద్రశేఖర్, అధిక సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉద్యమ స్ఫూర్తితో ముందుకు సాగుదాం

ప్రత్యేక తెలంగాణ కోసం ఎలాగైతే ఉద్యమం చేశామో అదే స్ఫూర్తితో కాంగ్రెస్ పార్టీని గద్దె దింపేందుకు పని చేయాలి. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే ఆరు గ్యారెంటీలను పక్కాగా అమలు చేస్తామని కాంగ్రెస్ ఎన్నికల సందర్భంగా చెప్పింది. కానీ, పదకొండు నెలలైనా అందులో ఒక్క హామీని పూర్తిస్థాయిలో అమలు చేయలేదు. కాంగ్రెస్‌పై ప్రజ ల్లో వ్యతిరేకత మొదలైంది. దానిని క్షేత్రస్థాయిలో తీసుకువెళ్లి ప్రజలను చైతన్యం చేయాల్సిన బాధ్యత ప్రతీ ఒక్క బీఆర్ఎస్ కార్యకర్తపై ఉన్నది.

- కోరుకంటి చందర్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు

కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలి

అధికారమే పరమావధిగా అబద్ధాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌కు ప్రజలు బుద్ధి చెప్పాలి. ఆ దిశగా బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పనిచేయాలి. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో గులాబీ జెండాను ఎగురవేసి సత్తా చాటాలి. తెలంగాణ గడ్డమీద పుట్టి ప్రతి ఒక్కరూ బాగుపడాలనే లక్ష్యంతో బీఆర్ఎస్ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేసింది. బంగారు తెలంగాణ కోసం అడుగులు పడుతున్న తరుణంలో కాంగ్రెస్ ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చింది. తిరిగి బంగారు తెలంగాణలో భాగస్వాములు కావాలంటే బీఆర్ఎస్‌నే గెలిపించాలి.

-దాసరి మనోహర్‌రెడ్డి, పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే

నమ్మించి మోసం చేయడమే కాంగ్రెస్ నైజం

దశాబ్దాల కాలంగా ప్రజలను నమ్మించి మోసం చేయడమే కాంగ్రెస్ నైజంగా ఉంది. అదే ఈ ఎన్నికల్లోనూ జరిగింది. నిజంగా దేశం అభివృద్ధి చెందాలంటే కాంగ్రెస్‌కు ప్రజలు చరమగీతం పాడాలి. ఆ పార్టీ లేకుంటేనే దేశం బాగు పడుతుంది. నెహ్రూ, ఇందిరా, రాజీవ్‌గాంధీల నుంచి మొదలుకొని రాజ్యాంగాన్ని తూట్లు పొడిచి ఇప్పుడు రాహుల్‌గాంధీ రాజ్యాంగాన్ని పట్టుకొని తిరుగతున్నడు. కానీ, రాష్ట్రంలో సీఎం రేవంత్ ఏ రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నాడో ప్రజలందరికీ తెలుసు. కేసీఆర్ పాలనే గొప్పదని కాంగ్రెస్ నాయకులు బాహాటంగానే చెబుతున్నరు. నమ్మక ద్రోహం చేసిన కాంగ్రెస్‌ను నిలదీసేందుకు ప్రజలు సిద్ధమవుతున్నరు.

-పుట్ట మధూకర్, మంథని మాజీ ఎమ్మెల్యే

విద్యార్థుల ఉసురు తగులుతది

గులాబీ జెండా అంటేనే ఒక గౌరవం. బీఆర్ఎస్ అంటేనే ప్రజలకు ధైర్యం. భవిష్యత్తు బాగుండాలని బడుగు బలహీన వర్గాల విద్యార్థుల కోసం గత ప్రభుత్వం గురుకులాలను ఏర్పాటు చేసింది. కానీ, ఇప్పటి ప్రభుత్వం విద్యార్థులు ఆ గురుకులాల్లో చదివేందుకు భయపడేలా చేసింది.. వందల సంఖ్యలో విద్యార్థులు మరణిస్తున్నా, అనారోగ్యం బారిన పడుతున్నా పట్టించుకోవడం లేదు. విద్యార్థుల కష్టాలు దూరం కావాలంటే తిరిగి బీఆర్ఎస్ అధికారంలోకి రావాలి.

-దాసరి ఉష, బీఆర్ఎస్ నాయకురాలు

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ ఎండీ సలీం, పక్కన జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్ రావు, ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్, దావ వసంత

ప్రజల గుండెల్లో కేసీఆర్

- ఆయన పోరాటంతోనే స్వరాష్ట్ర కల సాకారం • దీక్షా దివస్ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్సీ ఎండీ సలీం • జగిత్యాలలో దీక్షా దివస్ సక్సెస్

జగిత్యాల, నవంబర్ 29: తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ రాష్ట్ర ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని జగిత్యాల దీక్షా దివస్ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్సీ ఎండీ సలీం కొనియాడారు. కేసీఆర్ చేసిన పదకొండు రోజుల ఆమరణ దీక్ష, ఆ తర్వాత అలుపెరుగని పోరాటంతోనే కేంద్రం దిగివచ్చి రాష్ట్రాన్ని ఇచ్చిందని, ప్రజల చిరకాల కల సాకారమైందని చెప్పారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన దీక్ష దివస్ కార్యక్రమంలో పాల్గొన్నారు. అంతకుముందు బీఆర్ఎస్ నాయకులతో కలిసి జగిత్యాలలోని ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం బీఆర్ఎస్ కార్యాలయంలో కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేసి, సభలో ప్రసంగించారు. నాటి ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ ప్రాంతానికి జరుగుతున్న అన్యాయాన్ని ఎండగట్టి, మన రాష్ట్రం మనకు కావాలని కేసీఆర్ పోరుబాట పట్టారన్నారు. ఉద్యమంలో ఎన్నో పదవులను తృణప్రాయంగా వదిలేసి, రాష్ట్ర సాధన కోసం మడమ తిప్పకుండా ముందుకుసాగారన్నారు. ఆయన పోరాటంతోనే తెలంగాణ వచ్చిందని, దశాబ్దాల కల సాకారమైందని కొనియాడారు. ముఖ్యమంత్రిగా రాష్ట్రాన్ని